ప్రజాశక్తి

గురువారం 25 జులై 2024 | 5 | విజయనగరం

కేంద్ర బడ్జెట్‌పై నేడు సిపిఎం నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరం

పార్లమెంట్‌లో ఆర్థికశాఖా మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి, జిల్లాకు సరైన కేటాయింపులు లేకపోవడాన్ని నిరసిస్తూ గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోనూ నిరసనలు తెలపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌లో విభజన చట్టంలోని పేర్కొన్న అన్నింటికీ నిధులు ఇస్తారని ఆశించిన ప్రజలకు తీవ్ర నిరాశెదురైందని తెలిపారు. జిల్లాలోని గిరిజన యూనివర్శిటీకి తగిన నిధులు కేటాయింపులు లేవని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సైతం తగినన్ని నిధులు కేటాయించలేదన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలకు అండగా నిలిచిన విశాఖ ఉక్కు పరిశ్రమను ఆదుకోపోగా, గతం కంటే నిధులు తగ్గించడం దుర్మార్గమని అన్నారు. ఈ నేపథ్యంలో బడ్జెట్‌కు నిరసిస్తూ పెద్దఎత్తున నిరసనలు తెలపాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఊపందుకున్న ఉబాలు

రేగిడి మండలం తునివాడలో నాట్లు వేస్తున్న కూలీలు

- ఇప్పటివరకు 10 వేల ఎకరాల్లో వరినాట్లు
- కొనసాగుతున్న వర్షాలు
- ప్రాజెక్టుల్లో పెరుగుతున్న నీటి మట్టాలు

91.6మి.మీ. వర్షం

జిల్లా వ్యాప్తంగా బుధవారం 91.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా మెంటాడలో 5.8మి.మీ, అత్యల్పంగా రాజాంలో 0.7మి.మీ. వర్షం పడింది. అన్ని మండలాల్లోనూ అడపాదడపా వర్షం కురిసింది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి.

ప్రజాశక్తి-బొబ్బిలి

అల్పపీడన ప్రభావంతో వారం రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలతో వరినాట్లు ఊపందుకున్నాయి. బొబ్బిలి, జామి, రేగిడి, శృంగవరపుకోట, నెల్లిమర్ల, గుర్ల తదితర మండలాల్లో నాట్లు వేస్తుండగా, మిగతా మండలాల్లో నారు అందకపోవడంతో నాట్లు ప్రారంభం కాలేదు. ఖరీఫ్‌లో వరి సాధారణ విస్తీర్ణం 2,25,145 ఎకరాలు కాగా, ఇప్పటివరకు సుమారు 10వేల ఎకరాల్లో నాట్లు పడినట్లు అధికారులు చెబుతున్నారు. 21వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

బొబ్బిలి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో రైతులంతా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఎక్కడికక్కడ రైతులు దమ్ములు పడుతున్నారు. నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ సాగుపై రైతులకు వ్యవసాయ శాఖాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. నియోజకవర్గంలో 38,025 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. అందులో బొబ్బిలి మండలంలో 17,015 ఎకరాలు, రామభద్రపురంలో 3882.5 ఎకరాలు, బాడంగిలో 6562.5 ఎకరాలు, తెర్లాం మండలంలో 10,565 ఎకరాల్లో వరిసాగు అవుతోంది. ఇప్పటివరకు 2500 ఎకరాల్లో వరినట్లు పడ్డాయి. విద్యుత్తు బోర్లు ఆధారంగా 15వందల ఎకరాలు, వర్షం ఆధారంగా మరో వెయ్యి ఎకరాల్లో నాట్లు పడ్డాయి. నియోజకవర్గంలో మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 8937 ఎకరాలు కాగా, ప్రస్తుతానికి 3020 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. పత్తి 4067 ఎకరాలకు గాను ప్రస్తుతం 1222 ఎకరాల్లో విత్తనాలు నాటారు. వేరుశనగ 260 ఎకరాలు, గోగు 712 ఎకరాల్లో సాగవుతున్నాయి. చెరకు 2105 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వర్షాలు కురవడంతో వరినాట్లు వేయడంతో పాటు పత్తి, మొక్కజొన్న, చెరకు, రాగి, మినుము, వేరుశనగ వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

ఎరువులు సిద్ధం

రైతులకు ఎరువులు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు. ప్రయివేటు షాపుల్లో యూరియా 3150 మెట్రిక్ టన్నులు, డిఎపి 1120 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువు 840 మెట్రిక్ టన్నులు... మొత్తం అన్ని రకాల ఎరువులు 5206 మెట్రిక్ టన్నులు నిల్వ ఉన్నట్లు వ్యవసాయ శాఖ ఎడి మజ్జి శ్యామసుందర్ చెప్పారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో యూరియా 12 టన్నులు, డిఎపి 12 టన్నులు పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు.

బొబ్బిలి మండలంలో ట్రాక్టర్‌తో దమ్ముపడుతున్న రైతు

రైతులకు అందుబాటులో వ్యవసాయ శాఖ సిబ్బంది

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు వ్యవసాయ శాఖాధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ సహాయకులు నిరంతరం అందుబాటులో ఉంటారు. ఖరీఫ్ సాగుపై సలహాలు సూచనలు ఇస్తారు. మండలాల్లో ఎఒలు పర్యటించి రైతులకు అందుబాటులో ఉంటారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నారు.

- మజ్జి శ్యామసుందర్, వ్యవసాయ శాఖ ఎడి

ముమ్మరంగా వ్యవసాయ పనులు

రేగిడి : మండలంలోని ఖరీఫ్ వ్యవసాయం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాగావళి నది ప్రవహించడంతో ఖరీఫ్ వ్యవసాయ పనులు జరుగు తున్నాయి. మరో వారం రోజులలో ఈ ఖరీఫ్ వ్యవసాయ పనులు పూర్తవుతాయని వ్యవసాయ మండల అధికారి గిరడ మురళీకృష్ణ తెలిపారు. సచివాలయ పరిధిలో ఉన్న రైతు కార్యాలయాల్లో రైతులకు విత్తనాలు పంపిణీ చేశామని, పంటలకు దిగుబడులకు అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. వెంకంపేట, మీసాల డోలపేట, తుని వాడ తదితర గ్రామాల్లో వ్యవసాయ అసిస్టెంట్లు ఖరీఫ్ వ్యవసాయాన్ని పరిశీలించి, రైతులకు పలు సూచనలు, సలహాలు అందిస్తున్నారు.

టిడిపి,వైసిపి పాలకుల మధ్య..

నలిగిపోతున్న కార్పొరేషన్ అధికారులు

వైసిపి పాలకుల ఆక్రమణలపై పెరుగుతున్న ఫిర్యాదులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పాలక సంస్థలో పాలకవర్గ సభ్యులు వైసిపికి చెందిన వారు కాగా, అధికారంలో ఉన్నది టిడిపి. స్థానిక ఎమ్మెల్యే కూడా టిడిపికి చెందిన వారు కావడంతో నగర పాలక సంస్థ అధికారులకు తల నొప్పిగా మారింది. గత వైసిపి ప్రభుత్వ కాలంలో చెప్పిందే వేదం, చేసిందే పని తప్పు చెప్పేవాడు అడిగే వారు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా పాలన సాగింది. దీంతో గత ప్రభుత్వ హయాంలో అధికారులకు చెప్పకుండా ఇష్టారాజ్యంగా ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలు ఆక్రమించి షాపులు, పలు నిర్మాణాలు చేపట్టారు. చివరకు మాన్సాస్ భూములు కూడా ఆక్రమించి డూప్లికేట్ పట్టాలు చూపించి పలుచోట్ల షాపులు ఏర్పాటు చేసుకున్నారంటే ఆశ్చర్యం కలుగుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలు కారణంగా నగరంలోని రాజీవ్‌నగర్ కాలనీలో కాలువల వెంట వెళ్లాల్సిన నీరు కాలనీలో ఉన్న ఇళ్లోకి వెళ్లింది. దీంతో స్థానికులు ఎమ్మెల్యే అదితి గజపతిరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి పరిశీలిస్తే అసలు రంగు బయట పడింది. రాజీవ్ నగర కాలనీ కి ఆనుకొని స్వర్గధామం ఎదురుగా ఉన్న స్థలంలో వైసిపి చెందిన అనుచరులు షెడ్ వేసి కార్లు వాటర్ సర్వీసింగ్ నడుపుతున్నారు. మొదట వంద గజాల స్థలంలో ఏర్పాటు చేసిన షెడ్ ఎన్నికలకు ముందు అది కాస్తా 500 గజాలకు విస్తరించింది.

వాటర్ సర్వీసింగ్ సెంటర్ కావడంతో అవతల వైపు మురికినీరు వెళ్లేందుకు వేసిన ఖానాను సైతం మూసేసి నీరు అవతల వైపుకు వెళ్లకుండా కప్పేశారు. ఎమ్మెల్యే పరిశీలనలో ఆ స్థలం మాన్సాస్‌ది అని తెలిసింది. డూప్లికేట్ పట్టా చూపించి స్థలం ఆక్రమించినట్లు విచారణలో తేలింది. దీంతో ఎమ్మెల్యే వెంటనే రెండు గంటల సమయంలో ఆ స్థలం ఖాళీ చేసి, ఖానా గుండా నీరు వెళ్లేందుకు ఏర్పాట్లు చెయ్యాల ని అధికారులను ఆదేశించారు. విషయం తెలుసుకున్న వైసిపి కార్పొరేటర్ నగర పాలక సంస్థ కార్యాలయానికి వచ్చి ఎలా తొలగిస్తారనీ అధికారులతో సిబ్బందితో వాగ్వివాదం చేసినట్లు తెలిసింది. చేసిన తప్పును సరిచేసుకోకుండా కార్యాలయానికి వచ్చి వీరంగం వేయడం పట్ల కార్పొరేటర్ తీరుపై అధికారులు గుస గుసలాడు కుంటున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలు పాటించక తప్పదు, మరో వైపు పాలకవర్గం సభ్యులు వైసిపి పార్టీ వారు కావడంతో అడకత్తెరలో పోకచెక్కలా అధికారులు నలిగిపోతున్నారు.

ప్రతి సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యలు పరిష్కార వేదికకు ఆక్రమణలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. అన్ని వార్డుల్లోను ఆక్రమణలు మీద పిర్యాదులు వస్తుండటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. చేసిన తప్పులకు బాధ్యులుగా ఉద్యోగులు బలైపోతారనే భయంతో అధికారులు ముందుకు వెళ్లలేక, వెనక్కి రాలేక తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు గత పాలకులు చేసిన తప్పులను సరిచేసే పనిలో ఎమ్మెల్యే ఉన్నారు. వార్డుల్లో ఆక్రమణలపై నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తుండంతో ఆమె అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఖోఖో ఆడుతున్న బాలికలు

పాఠశాలల్లో క్రీడా జాతర

ప్రజాశక్తి-గజపతినగరం

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 22 నుంచి చేపడుతున్న 'శిక్షసప్తహ్' కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో క్రీడా జాతర జరిగింది. వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ క్రీడా అంశాల్లో పాల్గొని సందడి చేశారు. గజపతినగరంలోని బాలికల ,బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. రమేష్ కుమార్, వెంకటేశ్వరరావు సమక్షంలో క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీల్లో విజేతలను ప్రధానోపాధ్యాయులు అభినందించారు

ఉన్నత విద్యతో భవిష్యత్తుకు పునాదులు : ఎస్‌పి

హోంగార్డుల పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్ అందజేత

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఉన్నత విద్యతో భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని విద్యార్థులకు ఎస్‌పి వకుల్ జిందాల్ సూచించారు. హోంగార్డుల సంక్షేమంలో భాగంగా ఇటీవల 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి, మంచి మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించిన 15 మంది విద్యార్థులకు మెరిట్ స్కాలర్ షిప్‌లను జిల్లాపోలీసు కార్యాలయంలో బుధవారం అందజేసారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఉన్నత విద్యతోనే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందన్నారు, అందుకు తగిన విధంగా విద్యార్థులు శ్రద్ధ, క్రమశిక్షణతో తమ చదువులను కొనసాగించి, మంచి ఫలితాలను సాధించాలన్నారు. మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకొని, ఉన్నత స్థానానికి చేరుకొనేందుకు కృషి చేయాలని, తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని విద్యార్థులకు తెలిపారు. హోంగార్డుల సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పోలీసు కార్యాలయ పర్యవేక్షకులు ప్రభాకరరావు, హోంగార్డులు, వారి పిల్లలు పాల్గొన్నారు.

విద్యార్థినికి స్కాలర్‌షిప్ చెక్కును అందజేస్తున్న ఎస్‌పి వకుల్‌జిందాల్

ఆర్‌టిసి పార్శిల్ రవాణా కార్యాలయం వద్ద నిల్వ ఉన్న నీరు

చెరువు కాదు.. పార్శిల్ రవాణా సెంటర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఇది చెరువు అనుకుంటే తప్పులో కాలేసినట్టే..నిత్యం అత్యంత రద్దీగా ఉండే విజయనగరంలోని ఆర్‌టిసి పార్శిల్ సర్వీసు సెంటరు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో అక్కడ చెరువులా తయారైంది. ఆర్‌టిసి అధికారులు నిత్యం ఇక్కడే తిరుగుతున్నా దీని గురించి పట్టించుకోలేదు. ఆ సెంటర్ వద్ద గోతులు పడడంతో ఏ చిన్నపాటి చినుకు పడిడా నీరు నిల్వ ఉండిపోయి చెరువును తలపిస్తోంది. రోజూ వందలాది మంది ఈ పార్శిల్ సెంటర్‌కు వస్తుంటారు. అసలే వ్యాధులు ప్రబలే కాలం కావడంతో అధికారులు స్పందించి ఈ అధ్వాన పరిస్థితిని సరిదిద్దాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మంత్రి లోకేష్‌కు సమస్యలు వివరిస్తున్న ఎంపిటిసి సభ్యులు పాలవలస గౌరు

పాఠశాలను పునరుద్ధరించండి

లోకేష్‌కు ఎంపిటిసి గౌరు వినతి

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని ఎరుకులపాకలు గ్రామంలో 117 జిఒ వల్ల మూతపడిన ప్రాథమిక పాఠశాలను పునరుద్ధరించాలని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌ను ఎంపిటిసి సభ్యులు పాలవలస గౌరు కోరారు. రాష్ట్ర సచివాలయంలో ఎమ్మెల్యే బేబీనాయనతోపాటు నారా లోకేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వినతిని అందజేశారు. తనను వైసిపి నాయకులు పెట్టిన ఇబ్బందులను ఎన్నికల ముందు బాడంగిలో పర్యటన సందర్భంగా లోకేష్‌కు తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. రెడ్‌బుక్ సాక్షిగా తనకు అండగా ఉంటానని చెప్పారని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లను రద్దుచేసి ఎస్‌టి నిధులను దారిమళ్లించి ఐటిడిఎలను నిర్వీర్యం చేసి ఎరుకల, ఇతర గిరిజన తెగ ప్రజలకు అన్యాయం చేసిందని తెలిపారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున ఐటిడిఎకు నిధులు కేటాయించి ఎరుకల వృత్తిదారులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసి గిరిజనుల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. గతంలో తుపాకుల లైసెన్స్ ఇచ్చేవారని, వాటిని పునరుద్ధరించాలని మంత్రిని కోరారు. లోకేష్ స్పందిస్తూ దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు

15న రెండు అన్న క్యాంటీన్లు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా కేంద్రంలో ఆగస్టు 15న రెండు అన్నా క్యాంటీన్లను ప్రారంభించనున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ ఎం మల్లయ్య నాయుడు తెలిపారు. ఆయన ప్రజాశక్తి తో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలో ఇప్పటికే భవనాలు ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర ఒకటి, ప్రకాశం పార్క్ దగ్గర మరొక అన్నా క్యాంటీన్ ప్రారంభిస్తామని తెలిపారు. రూ.5కే ఆహారాన్ని ఈ క్యాంటీన్ల ద్వారా అందజేస్తామన్నారు. ఈ క్యాంటీన్లను పేదలు వినియోగించుకోవాలని సూచించారు.

వరద నీటితో ఇక్కట్లు

- విమానాశ్రయ నిర్మాణంలో కప్పేసిన చెరువులు, గెడ్డలు
- రోడ్డుపైకి చేరుతున్న నీరు
- కోతకు గురవుతున్న రహదారులు
- పరిమితికి మించి వస్తున్న వరదనీరు పొలాలపైకి
- ఆందోళన చెందుతున్న వివిధ గ్రామాల ప్రజలు

విమానాశ్రయం లోపల నుంచి బయటకు భారీగా వస్తున్న వరద నీరు

వరద నీటికి కోతకు గురైన జమ్మయ్యపేట రహదారి

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని 2200 ఎకరాల్లో నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఉన్న చెరువులు, కాలువలు, గెడ్డలు కప్పేసి నిర్మాణ పనులు చేస్తున్నారు. వర్షాలు పడుతుండడంతో ఇందులో నుంచి వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు అవకాశం లేక రోడ్లపై పొంగి ప్రవహిస్తోంది. దీనితో ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో పాటు రహదారులు దెబ్బతింటున్నాయి. రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ నిర్మాణ సంస్థలు పట్టించు కోవడం లేదని వివిధ గ్రామాల ప్రజలు అంటున్నారు. వివరాల్లోకి వెళితే...

భోగాపురం విమానాశ్రయం నిర్మాణంలో మూడు భారీ చెరువులు, వాగులు, గెడ్డలు కప్పేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో వర్షాలు పడుతుండడంతో ఈ నీరు గ్రామాల్లోకి, రహదారులపైకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు కూడా దెబ్బ తినడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వివిధ గ్రామాల ప్రజలు అంటున్నారు. ముఖ్యంగా రెల్లిపేట సమీపంలోని అచ్చెమ్మ చెరువు, రాళ్లపాలెం సమీపంలోని సరగడ చెరువు, బొల్లింకలపాలెం సమీపంలోని బొల్లింకల చెరువులకు ఈ విమానాశ్రయం పరిధిలోని నీరు కాలువలు ద్వారా చేరుతుంది. ప్రస్తుతం రెడ్డికంచేరు, గూడెపువలస సమీపంలోని మూడు గుడులు వద్ద, జమ్మయ్యపేట సమీపంలో కొత్తగా వేసిన రహదారిపైకి రెండేసి పైపులేసి వదిలేశారు. దీంతో జమ్మయ్యపేట నుంచి హైవేకు వచ్చే రహదారి విమానాశ్రయం నుంచి వచ్చిన వరద నీటికి పూర్తిగా దెబ్బతింది. రెడ్డికంచేరు సమీపంలో రోడ్డు పైనుంచి నీరు వచ్చి గ్రామంలోకి వెళ్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గూడెపువలస సమీపంలోని విమానాశ్రయం లోపల నుంచి వస్తున్న నీరు మూడు గుడులు వద్ద నుంచి ఎదురుగా ఉన్న చెరువులోకి వెళ్లి అక్కడ నుంచి పొలాలపైకి ప్రవహిస్తుండడంతో రైతులు ఆందోళన చెందు తున్నారు. రాళ్లపాలెం గెడ్డ వద్ద కూడా వర్షపు నీరు విమానాశ్రయంలో నుంచి నేరుగా రహదారిపై పొంగి ప్రవహిస్తోంది. ఈనేపథ్యంలో విమానాశ్రయ నిర్మాణ సంస్థ దీనిపై ప్రత్యేక చర్యలు చేపట్టి నీటిని ప్రజలకు ఇబ్బందులు లేకుండా బయటకు వెళ్లేలా చూడాలని వీరంతా కోరుతున్నారు.

రాకపోకలకు చాలా ఇబ్బందులు పడుతున్నాం

జమ్మయ్యపేట నుంచి హైవేకు వెళ్లేందుకు విమానాశ్రయం ప్రహరీగోడ పక్క నుంచి కొత్తగా రహదారిని వేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రహరీగోడ కింద నుంచి భారీగా విమానాశ్రయం లోపల నుంచి వరద నీరు వచ్చి రోడ్డు కోరుకుపోయింది. నాలుగు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి వాటిపై విమానాశ్రయ సంస్థ ప్రత్యేక దృష్టి పెట్టాలి

కొండపు రమణ, కొలువాడ గ్రామం

విమానాశ్రయంలోని వర్షపు నీరు పొలాలపైకి వస్తుంది

విమానాశ్రయం లోపల గతంలో చెరువులు ఉండడంతో నీరంతా చెరువుల్లోకి చేరేది. కాని ప్రస్తుతం చెరువులు పూడ్చేయడం వలన ఆ నీరంతా ఇప్పుడు గ్రామాల్లోకి, పొలాల్లోకి చాలా ఎక్కువగా వస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రానున్న రోజుల్లో ఇలాంటి సమస్యలు లేకుండా అధికారులు, విమానాశ్రయ నిర్మాణ సంస్థ చూడాలి.

మట్టా అయ్యప్పరెడ్డి, గూడెపువలస సర్పంచ్



మంత్రి కె.శ్రీనివాస్ తో మాట్లాడుతున్న అశోక్

మంత్రి కొండపల్లిని కలిసిన అశోక్

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు బుధవారం అమరావతిలో మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి కార్యాలయం ఉన్న 5వ బ్లాక్ లో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా ఇరువురు పలు విషయాలపై చర్చించారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

విజయనగరం కోట : స్థానిక శ్రీనివాస జూనియర్ కాలేజ్‌లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అనురాధ ఆధ్వర్యంలో బుధవారం చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. కళాశాల డైరెక్టర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఎవరైనా బాలికలు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు టోల్ ఫ్రీ నెంబర్లు కి ఫోన్ చేసి తమను తాము రక్షించుకోవాలని తెలిపారు. అనురాధ మాట్లాడుతూ చైల్డ్ మ్యారేజ్ , చైల్డ్ ట్రాఫికింగ్ , చైల్డ్ అబ్యూస్, గూర్చి టోల్ ఫ్రీ నెంబర్లు 1098, 181, 100 గురించి వివరించారు. అంగన్వాడీ కార్యకర్తలు నాగమణి, రూప , కుసుమ , విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-రామభద్రపురం

ముచ్చర్లవలసకు చెందిన నడగాన సురేష్ (24) బుధవారం తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబ సభ్యులు ఉదయం పార్వతీపురం వెళ్లి మధ్యాహ్నం తిరిగి ఇంటికి చేరారు. లోపలి నుంచి గడియవేసి ఉండటంతో వెనుకనుంచి తలుపునకు ఉన్న రంధ్రం నుంచి చూడగా వేలాడుతున్న సురేష్ మృతదేహం కనిపించింది. తలుపులు బద్దలుగొట్టి లోపలకు వెళ్లి చూసేసరికి అప్పటికే సురేష్ మృతి చెందాడు. తండ్రి రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ప్రేమ విఫలమై సురేష్ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది.

సంస్థ అందించిన సైకిళ్లతో విద్యార్థులు

అనాథలకు అండగా వికె ట్రస్ట్

ప్రజాశక్తి - బాడంగి

స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతూ దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వస్తున్న అమ్మా, నాన్న లేని అనాథ, సెమీ అనాథ విద్యార్థులకు బుధవారం సైకిళ్లను పంపిణీ చేశారు. అమెరికాలో స్థిరపడ్డ రెక్క శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసుధైక కుటుంబం ట్రస్ట్ తరఫున ఒక లక్ష రూపాయలు విలువైన 15 సైకిళ్లను వికె ట్రస్ట్ ప్రతినిధి సత్యకుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికె ట్రస్ట్ ప్రాంతంలో వెనుకబడిన ప్రాంతాలలో అనాథ విద్యార్థులు చదువు కొనసాగేలా, వారు ఉద్యోగాలలో చేరే వరకు ఆర్థికంగా చేయూతనందిస్తుందని చెప్పారు. ఇక్కడ ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు పాఠశాలలో వికలాంగులకు చేస్తున్న సేవా కార్యక్రమాలు సోషల్ మీడియాలో చూసి ఇదే పాఠశాలలో అమ్మా, నాన్న లేని అనాథ పిల్లలు 40 మంది ఉన్నారని తెలిసి సైకిళ్లు పంపిణీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు రాజేశ్వరి, లక్ష్మణ దొర, హెచ్ఎం దత్తి సత్యనారాయణ, సునీల్, ఉమామహేష్, ఉపాధ్యాయులు, రమేష్, ప్రసాద్, రామారావు విద్యార్థులు, వారి సంరక్షకులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి - రామభద్రపురం

ప్రస్తుత వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని ఎంపిడిఒ ఈశ్వరమ్మ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సకల శాఖల అధికారులతో బుధవారం రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. తాగునీటి వనరులు పరిశుభ్రం చేయించాలన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీరు తాగేలా అవగాహన కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది పని ప్రదేశాల్లో ఉండాలని వ్యాధుల నియంత్రణకు అన్ని వేళలా సిద్ధంగా ఉండాలని, డెంగీ, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో వైద్య సిబ్బంది, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది, వెలుగు, సచివాలయ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పుష్కలంగా భూగర్భ జలాలు : డిడి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

భూగర్భ జలాలను పరిశీలిస్తున్న డిడి

మండల వ్యాప్తంగా భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయని జిల్లా భూగర్భ జలాలు, జల గణన శాఖ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. జిల్లా భూగర్భ జలాలు, జలగణన శాఖ ఆధ్వర్యంలో మండలంలో భూగర్భ జలాలపై బుధవారం ఆయన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మండల రెవెన్యూ అధికారి కార్యాలయ ప్రాంగణంలో ఉన్న భూగర్భ జల నిర్ధారణ యంత్రం (పీజోమీటర్) వద్ద తనిఖీలను నిర్వహించారు. ఈ తనిఖీలలో మండల వ్యాప్తంగా భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నట్లు నిర్ధారించారు. భూమి నుంచి 1.8 మీటర్లలోనే నీరు ఉందని, ఎనిమిది మీటర్ల వరకు నీరు ఎక్కువైతే ఉంటుందో ఆ ప్రాంతం భూగర్భ జలాలు సురక్షితంగా ఉంటుందని చెప్పారు. మండల పరిధిలో ఎండాకాలంలో ఏ విధమైన నీటి ఎద్దడి ఉండదని తెలిపారు. ప్రజలు గృహ అవసరాలు నిమిత్తం నీటిని పొదుపు చేయకుండా సాంకేతికంగా వరకు మాత్రమే వాడుకోవాలని తద్వారా భవిష్యత్తు తరాల వారికి మనం నీటి కొరత లేకుండా చూడవచ్చునని అన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు : పిఒ

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మాట్లాడుతున్న పిఒ విజయలక్ష్మి

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు అనుభవించక తప్పదని ఐసిడిఎస్ సిడిపిఒ జె.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కోమటిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలతో ఎదురయ్యే పరిణా మాలు, చిన్నారులపై జరిగే లైంగిక దాడులపై బుధవారం సదస్సు నిర్వహిం చారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే బ్యాడ్ టచ్, గుడ్ టచ్ గురించి అటు కుటుంబ సభ్యులు, ఇటు ఉపాధ్యాయులు నేర్పించాలని సూచించారు. చిన్న వయస్సులోనే పెళ్లి చేసుకోవడం వల్ల శారీరక ఎదుగుదల లేక గర్భం దాల్చి ప్రాణాల మీదికి తెచ్చుకోవడం దురదృష్టకరమన్నారు. అమ్మాయికి 21 సంవత్సరాలు, అబ్బాయిలకు 23 ఏళ్లు వచ్చే వరకు పెళ్లిళ్లు చేయకూడదని కోరారు. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్లు ఎన్.ప్రభావతి. ఎం.శుభలక్ష్మి, హెచ్ఎమ్ స్కూల్ లేడీ టీచర్స్, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

దోమల నివారణకు గంబూషియా చేపలు

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ పిహెచ్‌సి పరిధిలోని వేపాడ, వల్లంపూడి, ఏఎస్ పేట, కుంపల్లి, దబ్బిరాజుపేట, నీలకంఠరాజపురం అగ్రహారం గ్రామాలలో దోమలు వ్యాప్తి చెందకుండా బుధవారం చెరువులలో గంబుషియా చేప పిల్లలను విడిచిపెట్టారు. ఈ చేప పిల్లలను చెరువులో విడిచి పెట్టడం వల్ల దోమ జీవిత చక్రంలో గుడ్డు, లార్వా, ప్యూపా దశలు నీటిలో ఉంటాయి కాబట్టి చేప పిల్లలు వాటిని తినేయడంతో వృద్ధి ఆగిపోతుందని సిహెచ్ఒ ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్‌లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- రామభద్రపురం

మండల కేంద్రంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రాలను తహశీల్దార్ సులోచనారాణి బుదవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం ఆదేశాలతో ఈ నెల 27 వరకు ఆధార్‌లో సవరణలు మార్పు చేర్పులకు అవకాశం ఇచ్చిన నేపథ్యంలో గుర్తించిన ఆధార్ కేంద్రాల్లో సేవలకు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో తనిఖీలు చేస్తున్నామని పారదర్శకంగా నిర్ణీత రుసుములు మాత్రమే తీసుకొని సత్వర సేవలు అందజేయాలని ఆమె ఆదేశించారు. వయసు మార్పులో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. మీసేవా నిర్వాహకుడు డి.లక్ష్మణరావు, పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురం జంక్షన్‌లో బుధవారం వల్లంపూడి ఎస్ఐ కె. రాజేష్ వాహనాలను తనిఖీ చేశారు. ప్రధానంగా గంజాయి రవాణా అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు జంక్షన్‌లో ప్రతి వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో సక్రమంగా రికార్డులు లేని వారికి జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎట్టకేలకు జెజెఎం పనులు ప్రారంభం

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని ముంజేరు గ్రామంలో ఇంటింటికి కుళాయిల ద్వారా నీరు అందించే జల జీవన్ మిషన్ పనులు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ప్రధాన రహదారికి ఇరువైపులా పైపులను వేసే కార్యక్రమంలో భాగంగా గోతులను తవ్వుతున్నారు. ఇప్పటికే ఈ రహదారి చిన్నది కావడంతో వచ్చి పోయే వాహనాలతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి పైపులు వేయడం ద్వారా మరో మూడు అడుగుల రహదారి పోతుంది. దీనిని గ్రామంలోని కొంతమంది వ్యతిరేకించారు. చివరకు జేసిబి బ్రేకర్‌తో సిమెంట్ రోడ్డును పగలగొట్టి కింది నుంచి పైపు వెయ్యాలని నిర్ణయించారు. గ్రామ సర్పంచ్ పూడి నూకరాజు ఆధ్వర్యంలో ప్రస్తుతం పనులు ప్రారంభమయ్యాయి.

నేడు కౌలువాడలో గ్రామ సందర్శన

భోగాపురం - ప్రజాశక్తి

మండలంలోని కౌలువాడ పంచాయతీలో గ్రామ సందర్శన కార్యక్రమం గురువారం జరగనుందని ఎంపిడిఒ చంద్రకళ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ హాజరుకావాలని ఆమె కోరారు.

రోడ్డుకు గుంత.. ప్రయాణానికి చింత

● అధ్వానంగా ప్రధాన రహదారులు ● గుంతల్లో వర్షం నీరు చేరడంతో ప్రమాదాలు ● పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గత ప్రభుత్వ అలసత్వం, రోడ్లు, భవనాల శాఖ నిర్లక్ష్యం కారణంగా మండలంలోని ప్రధాన రహదారులన్నీ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఎక్కడికక్కడ రోడ్లు గుంతలు పడ్డాయి. దీనికి ఇటీవల కురిసిన వర్షాలకు ఆ రోడ్లపై ఉన్న గుంతల్లో నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఎక్కడ ఏ గోతు ఎంత లోతు ఉందో అంచనా వేయలేని చాలా మంది ప్రయాణికులు ప్రమాదాలకు గురై గాయాలపాలయ్యారు. భారీ వాహనాలు గోతుల్లో దిగి దెబ్బతిన్నాయి. దీంతో గ్రామీణ రహదారులంటేనే ప్రయాణికులు భయపడుతున్నారు.

మండలంలోని పలు ప్రధాన రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఏ రోడ్డు చూసినా గోతులతో దర్శనమివ్వడంతో ప్రయాణం నరకయాతనగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రామతీర్థం

నెల్లిమర్ల రైల్వే వంతెన సమీపంలో రోడ్డుకు ఏర్పడిన గుంత

రామతీర్థం గ్రామంలో చెరువును తలపిస్తున్న రోడ్డు

నడిబొడ్డున ఉన్న రహదారి గుంతలు ఏర్పడి చెరువులా మారింది. నగర పంచాయతి పరిధి మొయిద జంక్షన్ నుంచి జరజాపుపేటకు వెళ్లే రహదారిలో కల్వర్టు పూడుకుపోయి మరుగు నీరు రోడ్డు మీదకి వచ్చి వాహన దారులు, ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. రామతీర్థం జంక్షన్ నుంచి రామతీర్థం వెళ్ళే రోడ్డులో రైల్వే బ్రిడ్జి వద్ద గుంతలు ఏర్పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జరజాపుపేట, కొండ వెల గాడ జంక్షన్, లక్ష్మీదేవి పేట వద్ద గుంతలు ఏర్పడి వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో మరింత వర్షపు నీరు గుంతల్లో చేరి రోడ్లు చెరువుల్లా కనిపిస్తున్నాయి.

నగరపంచాయతీలో కల్వర్టు వద్ద నిలిచిపోయిన నీరు

ఏళ్లగా పరిష్కారం కానీ కల్వర్టు సమస్య

నగర పంచాయతి పరిధిలోని మొయిద జంక్షన్ సమీపంలో చికెన్ దుకాణం వద్ద ఉన్న కల్వర్టు సమస్య ఏళ్లగా పరిష్కారం కావడం లేదు. వర్షం పడినప్పుడల్లా కల్వర్టు నుంచి నీరు కిందకు పారకపోవడంతో మురుగు నీరంతా రోడ్డుపైకి వచ్చి దుర్వాసనతో ప్రవహించడం వల్ల స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది పారిశుధ్య పనులు చేస్తున్నా కల్వర్టు ఇరుకుగా ఉండడం వల్ల పూడుక తీయడం కష్టంగా ఉందని చెబుతున్నారు. కల్వర్టు వెడల్పు చేయడం ద్వారా పూడిక నివారించి నీరు నిల్వ కాకుండా చేయగలమని చెబుతున్నారు. ఎన్నో ఏళ్లుగా నగర పంచాయతి కల్వర్టు సమస్యను పలు మార్లు రహదార్లు, భవనాల శాఖ దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోలేదని నగర పంచాయతి సిబ్బంది చెబుతున్నారు. ఇదిలా వుండగా రామతీర్థం గ్రామంలో నడిబొడ్డున ఇదే పరిస్థితి ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ గ్రామంలో మరుగు నీరు రహదారి పై ప్రవహించి గుంతలు పడి వాహనదార్లు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రహదార్లు, భవనాల శాఖ స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

అధ్వానంగా మారిన నరిసిపల్లి మెట్ట రోడ్డు

వలస కూలీలకు రోడ్డు సౌకర్యమేది?

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామ సచివాలయం పరిధిలో గల నరిసిపల్లి మెట్ట వద్ద 40 కుటుంబాలకు పైగా వలస కూలీలు నివస్తున్నాయి. వీరి పిల్లలు చదువుకోవాలంటే సోంపురం, రామస్వామి పేట, జాకేరు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లాల్సి ఉంది. జాకేరు నుంచి రామస్వామి పేట ప్రధాన రహదారికి రెండు కిలోమీటర్లు రోడ్డు క్వారీ లారీలు తిరగడంతో పూర్తిగా పాడైపోయింది. అడుగడుగునా గుంతలు పడటంతో నడవడానికి కూడా వీల్లేకుండా తయారైంది. ఈ రోడ్డు గుండా పాఠశాలకు వెళ్లాలంటే పిల్లలు నరకయాతన పడుతున్నారు. గతంలో ఈ రోడ్డును బాగుచేయాలని జిల్లా కలెక్టర్‌కు వినతినిచ్చినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామానికి వెళ్లే రోడ్డును బాగుచేయాలని వారంతా కోరుతున్నారు.

నిధుల సాధనతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

రామభద్రపురంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

కేంద్రం బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయించిన నిధులతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతోందని టిడిపి విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం మహిళా అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం మహిళా నాయకులతో కలిసి నిధులు సాధించినందుకు గాను సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా వనజాక్షి మాట్లాడుతూ అమరావతి రాజధానికి రూ. 15 వేల కోట్లు కేటాయించడం సుభపరిణామమన్నారు. వైజాగ్ చెన్నై ప్రత్యేక కారిడార్‌కు నిధులు మంజూరు చేయడం, రహదారుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అనురాధ బేగం, కింతాడ కళావతి, చీకటి సుహాసిని, రెడ్డి సంతోషి, నరవ రామలక్ష్మి, యడ్ల లక్ష్మి, కాళ్ల సత్యవతి, పొడుగు కృష్ణవేణి, వీపు మీనాక్షి, మడ్డు ఆదిలక్ష్మి, చందక గౌరీ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

రామభద్రపురం: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యపడుతుందని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతి నాయుడు అన్నారు. బుధవారం బూసాయవలసలో ఆయన మాట్లాడుతూ విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబు తోనే సాధ్యమన్నారు. గత ఐదు సంవత్సరాలు వైసిపి పాలనలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా కేంద్రం నుంచి రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా నిధులు తెచ్చుకోలేకపో యారని, సిఎంగా చంద్రబాబు పదవి బాధ్యతలు స్వీకరించిన 45 రోజుల్లోనే కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అధిక నిధులు తెచ్చుకోగలిగారని గుర్తు చేశారు. అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు, విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి రూ.628 కోట్లు, విశాఖ చెన్నై కారిడార్‌తో పాటు రాష్ట్రంలో వెనుకబడి ఉన్న ఏడు జిల్లాలకు నిధులు తెప్పించు కోవడంలో చంద్రబాబు విజయం సాధించారన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కూడా నిధులు కేటాయింపు హామీ ఇవ్వడం గర్వకారణం అన్నారు. ఈ సమావేశంలో బీసీ సెల్ ఉపాధ్యక్షులు కర్రోతు తిరుపతి రావు పాల్గొన్నారు.

నూతనంగా తయారైన మండల విద్యా వనరుల కేంద్రం

ఉపాధ్యాయుల సహకారం..మారిన భవనం

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల శాఖ కార్యాలయం రూపురేఖలు మారాయి. శిథిలావస్థకు చేరిన భవనాన్ని ఉపాధ్యాయుల సహకారంతో నూతనంగా తయారు చేశారు. ఈ భవనం వర్షం వస్తే కారిపోయి ఫైల్స్ తడిచిపోడంతో పాటు, కిటికీలు తలుపులు శిథిలావస్థకు చేరాయి. మరుగుదొడ్లు కూడా పూర్తిగా పాడైపోయే పాములు నిలయంగా మారాయి. దీంతో ఉపాద్యాయులు అంతా కలసి రూ. 60 వేలు పోగు చేసి పాడైపోయిన తలుపులు కిటికీలు కార్యాలయానికి ఊడిపోయిన పెచ్చులు బాగు చేయించి భవనం రూపురేఖలను మార్చారు. ఈ భవనాన్ని బాగు చేయాలని ఉపాధ్యాయులు పలుమార్లు ఎంపిపి సత్యవంతుడు దృష్టికి తీసుకెళ్లినా ఆయన పట్టించుకోకపోవడంతో వారే సొంత డబ్బులతో భవనాన్ని బాగు చేయించుకున్నారు.

జిల్లాలో 6 అన్న క్యాంటీన్లు

● మొదటి విడతలో మూడు ప్రారంభం
●భవనాల అభివృద్ధికి రూ.94లక్షలు మంజూరు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఎన్నికల హామీలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు ప్రారంభానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో ఆరు అన్న క్యాంటీన్లు ఉన్నాయి. ఆరు క్యాంటీన్లలో మొదటి విడతలో మూడు, రెండో విడతలో మూడు క్యాంటీన్లను ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. క్యాంటీన్ భవనాలను బాగు చేసేందుకు రూ.94లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికే టెండర్లు ప్రక్రియను అధికారులు పూర్తి చేసి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అన్న క్యాంటీన్లు పున:ప్రారంభంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మొదటి విడతలో మూడు ప్రారంభం

జిల్లాలో ఆరు అన్న క్యాంటీన్లు ఉన్నాయి. విజయనగరం కార్పోరేషన్‌లో మూడు, బొబ్బిలి, నెల్లిమర్ల, రాజాం మున్సిపాలిటీలలో ఒకొక్క క్యాంటీన్ ఉంది. మొదటి విడతలో ఆగస్టు 15న విజయనగరం కార్పోరేషన్‌లోని ఆర్‌టిసి కాంప్లెక్స్, ప్రకాశం పార్కు వద్ద క్యాంటీన్లను, బొబ్బిలి క్యాంటీన్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రెండో విడతలో సెప్టెంబర్ 21న విజయనగరం కార్పోరేషన్‌లోని ఘోషాసుపత్రి, నెల్లిమర్ల, రాజాం మున్సిపాలిటీలో ఉన్న క్యాంటీన్లను పున:ప్రారంభానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

భవనాలను బాగు చేసేందుకు రూ.94లక్షలు మంజూరు

అన్నా క్యాంటీన్లను ప్రారంభించేందుకు ప్రభుత్వం ఆయా భవనాలను బాగు చేసేందుకు రూ.94లక్షలు మంజూరు చేసింది. విజయనగరం కార్పోరేషన్‌లోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఉన్న క్యాంటీన్‌కు రూ.7.50లక్షలు, ప్రకాశం పార్కు వద్ద క్యాంటీన్‌కు రూ.5.75లక్షలు, ఘోషాసుపత్రి వద్ద క్యాంటీన్‌కు రూ.5 లక్షలు, బొబ్బిలి క్యాంటీన్‌కు రూ.5లక్షలు, నెల్లిమర్ల క్యాంటీన్‌కు రూ.15.25లక్షలు, రాజాం క్యాంటీన్‌కు రూ.10.50లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. మొదటి విడతలో ప్రారంభించే క్యాంటీన్లను ఆగస్టు 10లోగా బాగు చేసేందుకు, రెండో విడతలో ప్రారంభించే క్యాంటీన్ భవనాలను సెప్టెంబర్ 21లోగా బాగు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలించిన ఇఇ

స్థానిక అన్న క్యాంటీన్ భవనాన్ని పబ్లిక్ హెల్త్ ఇఇ దక్షిణామూర్తి పరిశీలించారు. ఆగస్టు 15న క్యాంటీన్ ప్రారంభించనుండడంతో భవనాన్ని బాగు చేసేందుకు ప్రభుత్వం రూ.5లక్షలు మంజూరు చేసింది. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు చేపట్టి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఇఇ చెప్పారు. ఆగస్టు 10లోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయనతో మున్సిపల్ ఎఇలు రవికుమార్, సురేష్ ఉన్నారు..

అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వీర జవాన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని బొత్సవానివలస గ్రామానికి చెందిన జవాన్ గొట్టాపు శంకరరావు ఇటీవల వీరమరణం పొందిన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం గ్రామంలో జరిగిన పెద్దకర్మ కార్యక్రమంలో వీర బొబ్బిలి మాజీ సైనికుల సంఘం చైర్మన్ కెప్టెన్ ఎస్ పోలయ్య, అధ్యక్షులు రేవళ్ళ కిరణ్ కుమార్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సతీమణి కొమలత, పిల్లలను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గోవింద నాయుడు, ట్రెజరర్ వి.ఎస్.శర్మ, ఎంఎల్.రావు, బి.త్రినాధ, పి.రవి, ఎం. రామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వంగర ఎఎస్ఐగా ప్రసాద్

ప్రజాశక్తి - వంగర

స్థానిక పోలీస్ స్టేషన్ ఏఎస్ఐగా వి.ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చీపురుపల్లి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడ విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని వెల్లడించారు. 15 ఏళ్ల క్రితం వంగర పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించానని, పదోన్నతి పై ఇక్కడికి రావడం ఆనందంగా ఉందని అన్నారు.

నేటితో ముగియనున్న డిగ్రీ అడ్మిషన్లు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు గురువారంతో గడువు ముగియనుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు బుధవారం తెలిపారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కళాశాలకు హాజరైతే ఉచితంగానే రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. తమ కళాశాలలో బిఎ పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్స్, బిఎస్‌సి కెమిస్ట్రీ, బిఎస్‌సి మ్యాథమెటిక్స్ కోర్సులు కళాశాలలో అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఈ నెల 25వ తేదీ లోపల తమ రిజిస్ట్రేషన్ OAMDC వెబ్సైట్‌లో చేసుకోవాలని తెలిపారు.

ఘనంగా 'అయ్యంకి' జయంతి

ప్రజాశక్తి- డెంకాడ

డెంకాడ: అయ్యంకి చిత్రపటానికి మాలవేస్తున్న మహేష్

స్థానిక శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణయ్య జయంతి వేడుకలు లైబ్రేరియన్ వై మహేష్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య అని గుర్తు చేశారు. గ్రంథాలయ ఉద్యమ కారుడైన అయ్యంకి ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలోనూ సిద్ధహస్తులని కొనియాడరాడు. ఈ కార్యక్రమంలో పాఠకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక గ్రంథాలయంలో పద్మ శ్రీ అవార్డు గ్రహీత గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య 134 జయంతి వేడుకలు బుధవారం ఘణంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పింద్రంగి వలస ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.రవి బాబు, బాడంగి గ్రంథాలయాలధికారి ఆర్. దుర్గాప్రసాద్ ఆయన చిత్ర పటానికి పూల వేసి నివాళు లర్పించారు. వారు మాట్లాడుతూ అయ్యంకి వెంకట రమణయ్య గ్రంథాలయోద్యమంలో విశేషమైన కృషి చేశారన్నారు. బ్రిటిష్ రాక్షస పాలనలో భారతీయ ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో తన రచనలు ద్వారా ప్రజలలో చైతన్యం తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీఫ్‌విప్ పదవితో పార్టీ బలోపేతం

ప్రజాశక్తి-భోగాపురం

ఎమ్మెల్యే లోకం మాధవికి జనసేన పార్టీ చీఫ్‌విఫ్ పదవి ఇవ్వడం వల్ల పార్టీ మరింత పుంజుకుంటుందని ఆ పార్టీ నాయకులు కాకర్లపూడి శ్రీనివాసరాజు అన్నారు. భోగాపురంలోని ఆయన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని బలోపతం చేస్తారని ఉద్దేశంతో పవన్ కళ్యాణ్ ఆమెకి ఈ పదవి ఇవ్వడం గొప్ప విషయమన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎంతో బాగుందని, మన రాష్ట్రానికి రాజధాని కోసం అమరావతికి నిధులు కేటాయించడం వల్ల రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లపై ఉన్న నమ్మకంతోనే కేంద్రం నిధులను మంజూరు చేసిందని అన్నారు. గూడెపువలస గ్రామ సర్పంచ్ మట్ట అయ్యప్ప రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేకు పార్టీ చీఫ్ విఫ్ పదవి ఇవ్వడం సంతోషకరమైన విషయమన్నారు. విమానాశ్రయం నుంచి వస్తున్న వరదనీరు బయటికి వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు న్యాయవాది సుధాకర్, మైలపల్లి అప్పలకొండ, నరసింహులు, గుండపు సూరిబాబు, కర్రోతు శ్రీనివాసరావు, పిడుగు చిట్టిబాబు, బొల్లు త్రినాథ్, మాత నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వరిసాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - జామి

మండలంలోని విజనిగిరి గ్రామంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు ఎం. శ్రీనివాస్, పి.లక్ష్మణ్, జిల్లా వనరుల కేంద్రం డి ఆర్ సి చంద్ర శేఖర్ బాబు రైతులకు వరి సాగు పై అవగాహన కల్పించారు. ముందుగా రైతుల సలహాలు తీసుకుని, ముఖ్యంగా వరిలో వచ్చే కలుపు మొక్కలు కోసం రైతులకు వివరించారు. తాటిపూడి కాలువ ద్వారా గ్రామాలలోకి వస్తున్న నక్క పూతిక కలుపు నివారణకు విప్ సూపర్ 250 ఎంఎల్ ఒక ఎకరాకు ఆల్ మిక్స్ 8 గ్రాములు కలిపి వరి ఉడిచాక, ఎదచళ్ళాక 20 నుంచి 25 రోజుల లోపు పిచికారీ చేస్తే ఆ కలుపు నివారించుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస డివిజన్ సహాయ సంచాలకులు విజయ, ఎఒ కిరణ్‌కుమార్, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

చింతాడలో ఎరువుల పంపిణీ

మండలంలోని చింతాడ గ్రామంలో రైతు సేవా కేంద్రం ద్వారా రైతులకు బుధవారం ఎరువుల పంపిణీ కార్యక్రమం గ్రామ సర్పంచ్ ఎ.సుబ్రమణ్యం, యంపిటిసి సభ్యులు నరసింహ నాయుడు ఆధ్వర్యంలో చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎఒ స్వాతి, వైస్ సర్పంచ్ దాసరి అప్పారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

బాడంగి: మండలంలోని పినపెంకి గ్రామంలో వ్యవసాయ సహాయకులు వాడాడ సాయికుమార్ వరినాట్లు వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆచరించాల్సిన మెలుకువలపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. వరినారు తీసి కట్టలు కట్టేటప్పుడు నారు కొనలు (చిగుర్లు) తుంచి నాటుకోవా లన్నారు. దీని వల్ల వరిలో వచ్చే కాండం తొలుచు పురుగుని అదుపులో ఉంచవచ్చు అని చెప్పారు. సూడోమోనస్ ద్రావణంలో వరి నారు కట్టలు శుద్ధి చేసి నాటుకోవడం వల్ల వరి లో వచ్చే అగ్గి తెగుళ్లు, పాము పొడ తెగుళ్లని ముందస్తుగా అదుపు చేయవ చ్చునన్నారు. అనంతరం రైతు తెర్లి పాపారావు పొలంలో ప్రయోగాత్మకంగా సూడోమోనస్ ద్రావణం తయారు చేసి నారు శుద్ధి ఎలా చేయాలో చేసి చూపించారు.

ఎరువులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ సుబ్రమణ్యం

సేంద్రియ వ్యవసాయమే లాభదాయకం : ఎడి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

సేంద్రియ వ్యయవసాయం ద్వారానే రైతులకు లాభదాయకమని వ్యవసాయ డివిజనల్ సహాయ సంచాలకులు యం.శ్యాంసుందర్ అన్నారు. బుధవారం కోమటిపల్లి గ్రామంలో సేంద్రీయ వ్యవసాయంపై ఆయన అవగాహన కల్పించారు. వర్మీ కంపోస్టు, కషాయల తయారీలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం వల్ల దిగుబడి తక్కువ రావడంతో పాటు అనారోగ్య సమస్యలు వచ్చే అవకాలు ఎక్కువుగా ఉన్నాయన్నారు. సేంద్రియ ఎరువుల ఇంటి వద్దే తయారు చేసుకొనవచ్చునని దీనికి ఖర్చు కూడా తక్కువ అని దిగుబడి ఎక్కువని ఆరోగ్య కరమైన పంటలు పండించ వచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

సజ్జ పంటను పరిశీలిస్తున్న సైంటిస్టులు

సజ్జ పంట పరిశీలన

కొత్తవలస: మండలంలోని గనిశెట్టిపాలెంలో సహాయ కేంద్రం పరిదిలో ఉన్న సజ్జ పంటను క్షేత్ర స్థాయిలో విజయనగరం డాట్ సెంటర్ సైంటిస్టులు డాక్టర్ లక్ష్మణ్, కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసు, ఎడిఎ చంద్ర శేఖర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌ఎస్‌కె పరిధిలో సంవత్సరానికి మూడు పంటలు పండించడం ఆనందాన్ని కలిగించిందన్నారు. చిరు ధాన్యాలు వల్ల కలిగే ఉపయోగాలు, మేలుకవులు గురించి రైతులకు వివరించారు. సజ్జ పంట కంటే ముందు వేసే పప్పు ధాన్యాలు సాగులో సస్యరక్షణ చర్యలు తీసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చుని తెలిపారు. వరిలో దిగుబడి కోసం నానో యూరియా, నానో డియేపి, నానో ఫోటాష్ పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ విజయ, ఎఒ మాధురి శరణ్య, విఎఎ దుర్గారావు, నేచురల్ ఫార్మింగ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.